
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంగళవారం 9 జనవరి 2024

- ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
- 2014లో మూతపడ్డ పరిశ్రమ
- చిన్నాభిన్నమైన శ్రామికుల జీవితాలు
- ఫ్యాక్టరీని తెరిపించేందుకు సర్కారు కసరత్తు
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు, జిల్లా వాసులు

చిగురించిన ఆశలు



బిల్ట్ కర్మాగారంలోని బాయిలర్స్

ములుగు, జనవరి 8: బిల్ట్ కార్మికుల ఆశలు చిగురించాయి. ఫ్యాక్టరీని తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకేస్తోంది. మంగపేట మండలం కమలాపురంలోని ఈ కర్మాగారం 2014లో మూతపడగా దాన్ని పునరుద్ధరించేందుకు రేవంత్ సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రయత్నమే చేయగా అది సఫలీకృతం కాక కార్మికుల్లో సుమారు పదేళ్లుగా నైరాశ్యం నెలకొంది. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో ఈసారైనా తమ కలలు సాకారం అవుతాయా..? అని కార్మికులు చర్చించుకుంటున్నారు.

2014లో మూతపడిన ఫ్యాక్టరీ

కమలాపురంలో 1975 మార్చి 18న బిల్ట్ కర్మాగారానికి (కలప గుజ్జు తయారీ యూనిట్)కు పునాది రాయి పడింది. పారిశ్రామికవేత్త ఎల్.ఎం.థాపర్ ఏపీ రేయాన్స్ పేరిట కంపెనీని స్థాపించగా 1981లో ఉత్పత్తి ప్రారంభమైంది. 2014 వరకు విజయవంతంగా నడిచిన ఫ్యాక్టరీలో ఉత్పత్తయ్యే కలప గుజ్జుకు బహిరంగ మార్కెట్‌లో విలువ పడిపోయింది. దీంతో ఆ ఏడాది ఏప్రిల్ 4న ఉత్పత్తిని నిలిపివేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. అంతకు మూడురోజుల ముందు రెండు వేల మంది పీఎఫ్ కార్మికులను విధుల నుంచి తొలగించింది.

ప్రోత్సాహకాలను ప్రకటించిన బీఆర్ఎస్ సర్కార్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మూతపడ్డ తొలి మధ్యతరహా పరిశ్రమగా బిల్ట్ చర్చనీయాంశమైంది. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకొచ్చింది. 2015లో జీవో 19 ద్వారా కొంతమేరకు

‘బిల్ట్’ పునరుద్ధరణపై ప్రభుత్వం ఫోకస్

రాయితీలు ప్రకటించింది. అయితే అవి సరిపోవంటూ యాజమాన్యం తెగేసి చెప్పింది. ఈ నేపథ్యంలో మళ్లీ 2018లో రూ.350కోట్ల ప్యాకేజీని ప్రకటిస్తూ అప్పటి ప్రభుత్వం జీవో 48ను విడుదల చేసింది. కలపకు ఏటా రూ.21కోట్ల సబ్సిడీని ప్రకటించింది. ఏడేళ్లపాటు మొత్తం రూ.147 కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించింది. అలాగే విద్యుత్‌కు ఏటా రూ.9 కోట్ల చొప్పున ఏడేళ్లపాట్లు మొత్తం రూ.63కోట్లు, ఏటా 1.50లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును ఏడేళ్లపాటు సరఫరా చేసేందుకు రూ.వెయ్యి చొప్పున మొత్తంగా రూ.105 కోట్లను చెల్లించేందుకు ఒప్పుకుంది. కమర్షియల్ ట్యాక్స్, టీఎస్-ఎన్‌పీడీసీఎల్‌కు బకాయిపడ్డ సొమ్మును వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. అయితే.. మొదట్లో ఫ్యాక్టరీని తెరిచేందుకు అంగీకరించిన మేనేజ్‌మెంట్ కొద్దిరోజులకు మళ్లీ మాటమార్చింది. ఈ కర్మాగారం పేరున పెద్ద ఎత్తున రుణాలు తీసుకోగా రుణదాత సంస్థల ప్రతినిధులు, కార్మికులు నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్ఏటీ)ని ఆశ్రయించారు. తమ విషయంలో యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మికులు



బిల్ట్ కర్మాగారం

777 రోజులపాటు రిలే నిరాహారదీక్షలు చేశారు. మొదటి దఫా 363 రోజులుగా, రెండో దఫా 414 రోజులు దీక్ష కొనసాగించారు.

వేతన బకాయిలు ఇప్పిస్తారా...!?

ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలిచిపోవడానికి ముందు 600 మంది కాంట్రాక్టు కార్మికులు, 317మంది పీఎఫ్ కార్మికులను యాజమాన్యం విధుల నుంచి తొలగించింది. ప్రస్తుతం 600 మంది పర్మనెంట్ కార్మికులు మిగలగా వారికి ఎలాంటి జీతాలు లేవు. ఈమొత్తం బకాయి ఇప్పటి వరకు రూ.50 కోట్లపైనే ఉంటుందని అంచనా. గడిచిన తొమ్మిదేళ్లలో చాలామంది ఉద్యోగ విరమణ పొందగా వారికి ఎలాంటి ప్రయోజనాలు అందలేదు. ఒకవేళ ఫ్యాక్టరీని తెరిపిస్తే పెండింగ్ వేతనాల మాటేమిటి..? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఉపాధి లేక పొట్టచేత పట్టుకొని వలస పోయిన వారిని ఆదుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ప్రతినిధులతో సీఎం భేటీ



సీఎస్, మంత్రులతో కలిసి ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్షియల్ సొల్యూషన్ ప్రతినిధులతో చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అడుగు వేసిందని తెలుస్తోంది. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశాలతో బిల్ట్ ఆస్తులపై హక్కులు పొందిన ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ సొల్యూషన్ మేనిజింగ్ డైరెక్టర్ హార్ధిక్ పటేల్, ఐటీసీ పేపర్ బోర్డులు, స్పెషాలిటీ పేపర్స్ విభాగం సీఈవో వాదిరాజ్ కులకర్ణితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మంత్రులు సీతక్క కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ పునరుద్ధర ణపై చర్చించారు. కర్మాగారాన్ని తెరిపించేందుకు ప్రభుత్వం ద్వారా పూర్తి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. దీనిపై ఐటీసీ, ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దీంతో కార్మికుల్లో అడుగంటిన ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిల్ట్ కర్మాగారానికి మంచిరోజులు రావాలని సర్వత్రా కోరుకుంటున్నారు.



వైభవంగా మర్రిపల్లి బోనాల జాతర

భక్తులతో కిటకిటలాడిన పరిసరాలు





బోనాలతో మహిళలు, ఆలయ మండపంలో వేసిన పెద్ద పట్నం

కాటారం, జనవరి 8: మండలంలోని ప్రతాపగిరి పంచాయతీ పరిధి మర్రిపల్లిలో మల్లికార్జున స్వామి బోనాల జాతర సోమవారం వైభవంగా ముగిసింది. ఆలయం ఎదుట ఒగ్గు కళాకారులు పెద్ద పట్నాలు వేశారు. అనంతరం శివసత్తులు లక్ష్మీదేవరలు డోలువాయిద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య పూనకాలతో పట్నాలు తొక్కే కార్యక్రమం సాగింది. పలువురు మహిళలు ఆలయం వద్ద నైవేద్యంతో కూడిన బోనాలను వండి సాయంత్రం ఆలయ ప్రదక్షిణ చేసి మల్లన్నకు సమర్పించారు.

బోనాల జాతరకు ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, సర్పంచులు గుంటి లక్ష్మి, అశోక్, రాజమౌళితో పాటు పలువురు నాయకులు, పలు గ్రామాలకు చెందిన భక్తులు హాజరై తమ మొక్కులు చెల్లించుకున్నారు.ఎస్సై-2 సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజావాణిలో కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 8: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారి గోడును ఆలకించారు. వినతులపై అధికారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలన్నారు. ప్రజావాణి వినతులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా ప్రాధాన్య క్రమంలో సమస్యలను పరిష్కరించాలన్నారు.

ప్రజావాణిలో మొత్తం 32 వనతులు వచ్చాయి. ముఖ్యంగా దళితబంధు పథకానికి సంబంధించిన నిధులు మంజూరు చేయాలని టేకుమట్ల మండలం వెంకట్‌రావుపల్లి గ్రామానికి చెందిన బచ్చల రమేష్ వినతిపత్రం అందించారు. దళిత బంధు పథకం కింద రూ. 3.80 లక్షలు మంజూరు చేసిన అధికారులు మిగతావి చేయలేదని పేర్కొన్నారు. వెంటనే మిగిలిన సొమ్ము విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తనకు భూపాలపల్లి జిల్లా ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా ఉద్యోగావకాశం కల్పించాలని రేగొండ మండల కేంద్రానికి చెందిన కావ్య కలెక్టర్‌ను కోరారు.

నిర్భయంగా ఫిర్యాదులు చేయండి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 8: ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయ్యొచ్చని, ఫిర్యాదులు చేయొచ్చని భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా దివస్‌లో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులెవరైనా ఎలాంటి సంకోచించకుండా పోలీసులకు తమ సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించి తద్వారా శాంతిభద్రతలను పరిరక్షించడమే పోలీసుల కర్తవ్యమన్నారు. ప్రజా దివస్‌లో మొత్తం 11 మంది ఫిర్యాదులు అందించగా వాటిపై ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

రామప్ప దేవాలయాన్ని సందర్శించిన నెదర్లాండ్ దేశస్థులు



ఆలయం ఆవరణలో నెదర్లాండ్ దేశస్థులు

వెంకటాపూర్(రామప్ప), జనవరి 8: మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సోమవారం నెదర్లాండ్ దేశానికి చెందిన ఎరిక్ డీ వ్రైజ్, శాంతి డీ వ్రైజ్ వాన్‌నెక్, పీటర్ డీ వ్రైజ్, లైడ్ డీ వ్రైజ్ స్వార్మన్స్ సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడిని దర్శించుకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం దేవాలయ శిల్పకళా సంపదను వీక్షించి ఆలయ చరిత్ర, శిల్పకళా సౌందర్యం గురించి గైడ్‌లను అడిగి తెలుసుకుని మంత్రముగ్ధులయ్యారు. వారి వెంట టూరిజం ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, రీజినల్ టూరిస్టు గైడ్ కుమార్ ఉన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్

ములుగు కలెక్టరేట్, జనవరి 8: ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రజలు అందించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను అదనపు కలెక్టర్ పి.శ్రీజ పరిశీలించారు. సోమవారం ఆమె ములుగు మండలంలోని బండారుపల్లి మోడల్‌స్కూల్, తహసీల్దార్ కార్యాలయం, వెంకటాపూర్(రామప్ప)లోని ఎంపీవో, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి డేటా ఎంట్రీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అధికారులు, సిబ్బంది పలు సూచనలు చేశారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.

మిర్చి రైతుల ఆందోళన

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారంటూ ధర్నా
- ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఉద్రిక్తత
- పోలీసులు, అధికారుల చొరవతో సద్దుమణిగిన సమస్య



మార్కెట్ గేటు ముందు మిర్చి ధర తగ్గింని ధర్నా చేస్తున్న మిర్చి రైతులు

వరంగల్ టౌన్, జనవరి 8: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో వ్యాపారులు (ఖరీదుదారులు) మిర్చి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. ఉదయం మార్కెట్లో యథావిధిగా మిర్చి జెండా పాట (నాణ్యత గల మిర్చి ధరను నిర్ణయిస్తారు) పాడారు. తేజ రకం మిర్చికి క్వింటాకు రూ.20,100 నిర్ణయించారు. మార్కెట్‌కు వండర్ హాట్, తేజ, యూఎస్-341, దేశీ ఇలా సుమారు 20 రకాల మిర్చి అమ్మకానికి వస్తాయి. ఒక్కో రకానికి ఒక్కో ధర నాణ్యతను బట్టి వ్యాపారులు ధరలు నిర్ణయించి కొనుగోలు చేస్తారు. అయితే సోమవారం తేజ రకానికి క్వింటాకు రూ.20,100 జెండా పాట పాడగా వ్యాపారులు కొందరు రూ.17, ఇంకొందరు రూ.18వేలు, మరికొన్ని రూ.13 వేలు చొప్పున ధర నిర్ణయించి కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో తక్కువ ధర పలికిన రైతులు గొడవకు దిగారు.

విషయం తెలుసుకున్న మిగతా రైతులు పెద్ద ఎత్తున చేరుకుని తమకు కూడా ధరలు తగ్గించారని, గత ఏడాదితో పోల్చుకుంటే అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. మార్కెట్ ప్రధాన గేటు ముందు ఆందోళనకు దిగి కొద్ది సేపు ధర్నా చేశారు. సమాచారం అందుకున్న మార్కెట్ కార్యదర్శి సంగయ్య వెంటనే డీఎంవో ప్రసాదరావుకు, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశంకు పరిస్థితిని వివరించారు. అలాగే స్థానిక సీఐ మహేందర్, ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ దృష్టికి తీసుకెళ్లడంతో వారు మార్కెట్‌కు చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ఎవరి వాదన వారిదే...

వ్యాపారుల పక్షాన చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డిని, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు లింగారెడ్డిని, ఆందోళన చేస్తున్న రైతులను కార్యాలయానికి పిలిపించి మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు మల్లేశం, ప్రసాద్ రావు, ఏసీపీ సతీష్ బాబు, డీసీపీ రవిందర్ చర్చించారు. వ్యాపారులు, రైతులు ఎవరి వాదన వారిదే అన్నట్లు కొద్దిసేపు నడిచింది. నాణ్యతను బట్టి ధర పలుకుతుందని వ్యాపారులు చెప్పగా, క్వింటాకు రూ.17వేలు పలికిన మిర్చి, క్వింటా రూ.13వేలు పలికిన మిర్చి ఒకే రీతిలో ఉందని, అలాంటప్పుడు అంత తక్కువ ధరకు ఎలా కొంటారని రైతులు ప్రశ్నించారు.

మిర్చిలో నాణ్యత ఉంటే ఒక ఖరీదుదారు కాకపోతే మరో ఖరీదుదారుడికి ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చని, లేదా మంచి ధర పలికినప్పుడే అమ్ముకోవాలని అప్పటి వరకు కోల్డ్ స్టోరేజీలో పెట్టుకోవచ్చని వ్యాపారులు తమ వాదన వినిపించారు. అధికారులు ఇరువర్గాలకు నచ్చ చెప్పారు. తక్కువ ధర పలికిందనిపిస్తే ఆ రైతుల వద్దకు మార్కెట్ అధికారులు, ఖరీదుదారులు, పోలీసులు వచ్చి పరిశీలించి నాణ్యతకు అనుగుణంగా ధర పెట్టేందుకు మరో ఖరీదుదారుడిచే కొనుగోలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఇరువర్గాలకు నచ్చ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

టీబీ రహిత జిల్లాగా రూపుమాపాలి

ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, జనవరి 8: ములుగును టీబీ రహిత జిల్లాగా రూపుమాపాలని, ఇందుకోసం వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగులో టీబీ ముక్త్‌భారత్‌పై సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 సంవత్సరం నాటికి ములుగు జిల్లాను టీబీ రహితంగా మార్చేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. జిల్లాలో ఒక్కో టీబీ యూనిట్‌కు రెండు గ్రామాల చొప్పున ఎంపిక చేసి ప్రతి వెయ్యి మందికి 300 పరీక్షలు నిర్వహించాలని సూచించారు. టీబీగా తేలిన వ్యక్తులకు వెంటనే నిక్షయ పోషణ యోజన కింద రూ.500తోపాటు న్యూట్రిషన్ కిట్లను అందజేయాలన్నారు. ప్రతి గ్రామంలో 80 శాతం టీబీ సక్సెస్‌రేట్ ఉండేలా చూడాలన్నారు. జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పోరిక రవీందర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉన్న వైద్యాధికారులు, సిబ్బంది, ఆశాలు క్షయవ్యాధి అనుమానితుల నుంచి శాంపిల్స్ తీసుకొని పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో డీపీపీఎం పుల్లూరి సమ్మయ్య, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతయ్య, ఎస్టీఎస్‌లు రమేష్, వెంకటేశ్వర్లు, ఎస్టీఎల్ఎస్‌లు రవి, గురుదేవ్, పరశురాం, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎనీమియా ముక్త్‌భారత్

జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఎనిమిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఎనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం జరగ్గా ఆయన పాల్గొన్నారు. ఎవరికైనా రక్తహీనత ఉన్నట్లయితే చికిత్స, సదుపాయాలు అందించాలన్నారు. నిర్ధారించిన కేసులను గూగుల్ స్ప్రెడ్‌షీట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విపిన్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో సంవత్సరంలో రెండుసార్లు పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.


హిందూత్వ దాడులను ఖండించాలి

మావోయిస్టు ఏటూరునాగారం- మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి సబిత

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏటూరునాగారం, జనవరి 8: ప్రజాస్వామ్యవాదులపై బ్రాహ్మణీయ హిందూత్వ మతోన్మాదులు చేస్తున్న దాడులను ఖండించాలని మావోయిస్టు పార్టీ ఏటూరు నాగారం- మహదేవపూర్ ఏరియా కమిటీ కార్యదర్శి సబిత పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో భారతీయ నాస్తిక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన భీమాకోరేగావ్ స్ఫూర్తి దివస్ కార్యక్రమానికి హాజరైన బైరి నరేష్‌పై పూజారి రాధాకృష్ణతోపాటు ఆయన అనుచరులు దాడి చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయని పోలీసులు, దాడికి గురైన వారిపై చేసి హిందుత్వ ఫాసిస్టు శక్తులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తమ మతాలకు అనుగుణంగా ఆచారాలు, సంప్రదాయాలు పాటించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. అన్ని మతాలను అందరూ గౌరవించాల్సి ఉంటుందని తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంఘ్ పపరివార్ దాని అనుబంధ సంఘాలు మాత్రం ప్రజల వెనుకబాటు తనాన్ని ఆసరా చేసుకొని మెజారిటీ పేరుతో హిందువులను ప్రోత్సహిస్తూ మూకదాడులకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాదులు ఆదివాసీలు, దళితులపై చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. దాడికి ప్రధాన కారకుడైన పూజారి రాధాకృష్ణతో పాటు ఆయన అనుచరులపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

31లోగా ‘సీఎంఆర్’ డెలివరీని పూర్తి చేయాలి

పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 8: పెండింగ్‌లో ఉన్న వానాకాలం, యాసంగి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలవరీ ప్రక్రియను ఈనెల 31లోగా పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. సీఎస్ శాంతి కుమారితో కలిసి సెక్రటేరియట్ నుంచి ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లతో మాట్లాడారు. భూపాలపల్లి నుంచి కలెక్టర్ భవేష్ మిశ్రా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2022-23 వానాకాలం, యాసంగి సీఎంఆర్ డెలవరీపై సమీక్షించారు. సీఎంఆర్ చెల్లింపులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్ పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 50శాతం మేర రేషన్ బియ్యం రీసైక్లింగ్‌కు పాల్పడుతూ పౌల్ట్రీ ఫార్మ్, విదేశాలకు పాలిష్ చేసి ఎగుమతి చేస్తున్నారని, దీంతో రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల నష్టం వాటిల్లుంతోందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ఎలాంటి తరుగు లేకుండా ట్రక్ షీట్లను అందించి కొనుగోలు చేసి సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తులను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. రేషన్‌కార్డులు లేని దరఖాస్తుల వివరాలను ప్రత్యేకంగా అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎం రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 8 : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 60 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ కోసం 4, జీడబ్ల్యూఎంసీ 6, ఎస్సీ కార్పొరేషన్ 2, ఆర్డీవో 5, ఎంజీఎం 1, తహసీల్దార్ 11, ఎంపీడీవో 3, ఉపాధి కార్యాలయం 3 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ మేన శ్రీను, ఇండస్ట్రీస్ జీఎం హరిప్రసాద్, మైనింగ్ విభాగం ఏడీ నర్సిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీడబ్ల్యూవో మధురిమ, మెప్మా పీడీ భద్రునాయక్, డీపీవో జగదీశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు మహిళ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, జనవరి 8 : ఈనెల 10 నుంచి 14 వరకు కర్ణాటకలోని సేలం పెరియార్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ హ్యాండ్ బాల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు తెలిపారు. 2023-24 ఏడాదికిగాను కేయూ నుంచి ఎంపికైన క్రీడాకారుల వివరాలను సోమవారం ప్రకటించారు. ఎంపికైన వారిలో కె.సువర్ణ, బి.భాగ్యశ్రీ, బి.మాధవి, (యూసీపీఈ, కేయూ) ఎస్. శివరాణి,(యూసీఈటీ, కేయూ) ఎస్.నందిని, (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్, ఖమ్మం), బి.రమ్య,(యూసీపీఈ, కేయూ), ఎం.కరీన, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ(వుమెన్స్),ఆసిఫాబాద్), కె.రమ్య (వీసీపీఈ, బొల్లికుంట), బి. రేహజు, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్ ఖమ్మం), కె.సింధూజ, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్ ఉట్నూర్), ఎం.రచన, (యూసీపీఈ, కేయూ), సీహెచ్. మౌనిక (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్ ,ఉట్నూర్), టి.స్నేహ, (వీసీపీఈ, బొల్లికుంట), సీహెచ్.శివాని (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్, మంచిర్యాల) ఇ.వెన్నెల (టీటీడబ్ల్యూఆర్‌డీసీ (వుమెన్స్), కొత్తగూడెం).వి.రిషిత, (టీటీడబ్ల్యూఆర్‌డీసీ(వుమెన్స్), మంచిర్యాల)లు ఎంపికైయారు. వీరికి కొత్తగూడెం సింగరేణి వుమెన్స్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.

క్యాంపు కార్యాలయంలో నాయిని పూజలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజల నిర్వహణలో నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నీలిమారెడ్డితో పాటు సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ సిటీ, జనవరి 8 : హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచాక తన సతీమణి నీలిమారెడ్డి, అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కూతురు గోదారెడ్డి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కార్యాలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ కిరణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవీయస్ శ్రీనివాసాచార్యులు, ఈవీ శ్రీనివాస్, తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, వేద పండితులు విజయకుమారాచార్యులు, అరవింద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాల్సిందే..

కాజీపేట, జనవరి 8 : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట ఎంప్లాయిస్ సంఘ్ నాలుగు రోజుల రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సాధినేని వెంకటనారాయణ దీక్షలను ప్రారంభించారు. అనంతరం సీడబ్ల్యూసీ మెంబర్ చింత మురళి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టి జూదం ఆడుతుందన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, ఆ హక్కును ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసేంతవరకు ఉద్యమించి తీరుతామన్నారు. ఈ దీక్షలను స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో జమ్మికుంట బ్రాంచ్ సెక్రటరీ నర్సింగరావు, ఆపరేటింగ్ బ్రాంచ్ సెక్రటరీ ముస్తాక్ హుస్సేన్, వర్కింగ్ చైర్మన్ నారాయణ, కె. రవి, వరప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ఏకాంబరం, బల్వీందర్ సింగ్, అజీజ్ పాషతోపాటు రైల్వే కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైల్వేలను నిర్వీర్యం చేస్తున్న ప్రధాని మోదీ

రైల్వేలను ప్రధానిమోదీ పూర్తిగా నిర్వీర్యం చేస్తూ రైల్వే కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య అన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని నిలిపివేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట సోమవారం రైల్వే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షలను సీపీఎం నేత ఎం. చుక్కయ్య, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నేత చుక్కయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలో ఖాళీలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా రైల్వే కార్మికు లపై పనిభారాన్ని పెంచుతూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఈ నిరసన దీక్షలో నాయకులు ఓరుగంటి సాంబయ్య, కొండ శ్రీనివాస్, ఎస్‌కే.అప్జల్ పాల్గొన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో యూనియన్ ఆల్ బ్రాంచ్ కో- ఆర్డినేటర్ నాయిని సదానందం, దాడబోయిన శ్రీనివాస్ యాదవ్, సంగ రమేశ్, ఈ. రాజేందర్, కె. బాల మురళీ రాజ్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

టీ- ఎమ్మార్పీఎస్‌కు పలువురి రాజీనామా

వడ్డెపల్లి, జనవరి 8: తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ అనుసరిస్తున్న తీరుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వక్కల వెంకట్ మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నత్తి కోర్నెల్ మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాముల రమేష్ మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టెన్త్‌లో 100 శాతం ఫలితాలు సాధించాలి

హనుమకొండ రూరల్, జనవరి 8: పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో టెన్త్ ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల హాజరుశాతంపై అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. ఇక నుంచి ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతీ వారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హై, జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి ఎ.శ్రీనివాస్, రాధ, సునీత, విజయ్ కుమార్, రామ్‌కిషన్‌రాజు, వెంకటేశ్వర్‌రావు, రమాదేవి పాల్గొన్నారు.

కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) తిరుపతిరెడ్డి



విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

హనుమకొండ రూరల్, జనవరి 8: కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ (ఇన్‌చార్జి) వంటేరు తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని దీవ్య భవన్‌లో ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేసన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వంటేరు తిరుపతిరెడ్డి, విశిష్ట అతిథులుగా విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేసి కంపెనీని ఆర్థికంగా బలోపేతం చేయడంలో అకౌంట్స్ ఆఫీసర్ల పాత్ర కీలకమన్నారు. సమష్టి కృషితోనే ఏదైనా సాధించే సత్తా మనందరిలో ఉందని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ విషయంలో ప్రభుత్వానికి నివేదించి వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు తెలిపారు.

అనంతరం టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వేణుబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఉపేందర్, ఉపాధ్యక్షులుగా కె.నవీన్ కుమార్, బి.వసంత్‌రావు, ఎస్.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుదర్శన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఇ.మురళి, చంద్రమోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బి.లక్ష్మణ్, రేష్మ, ఫైనాన్స్ సెక్రటరీగా బి.దేవేందర్, మహిళా కార్యదర్శిగా ఎం.సునీత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ అదనపు కార్యదర్శి ఎ.నాగరాజు, అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు, జనరల్ మేనేజర్లు, ఎస్ఏఓలు, ఏఏఓలు, జేఏఓలు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే ధ్యేయం

దొంగల చేతిలో రాష్ట్రం లూటీ అయింది

రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతుల సేవలు అమూల్యం

ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్

గుర్తూర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ

పాల్గొన్న ఐదుగురు ఎమ్మెల్యేలు



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు

తొర్రూరు రూరల్, జనవరి 8 : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎన్ఆర్ఐ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సొంత ఖర్చుతో నిర్మిస్తున్న హనుమాండ్ల లక్ష్మమ్మ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భూమి పూజ కార్యక్రమాన్ని విప్ రాంచంద్రునాయక్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ ఎంతో మంది యువకుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం దొంగల చేతిలో పడి లూటీ అయిందన్నారు. అలాంటి దొంగలను ప్రజలు తరిమికొట్టి మార్పు కోరుకుంటూ విద్యావంతులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. రాజకీయాల్లోకి రాకుండానే 40 ఏళ్లగా సేవ చేస్తున్న డాక్టర్ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డిలు సేవాతత్పరులని, ఈ ప్రాంతం వారు కావడం అదృష్టమన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయగల సమర్థులని, ఇలాంటి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అనేకంగా ఏర్పాటు చేయడానికి ముందుకురావాలని కోరారు.

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాక్షస పాలనను అంతం చేసి శాంతియుత పాలనకు స్వాగతం పలికిన ప్రజలను కాపాడుకోవడానికి ఝాన్సీ రుద్రమ్మవలే ముందుకు వచ్చారన్నారు. యువతలో నైపుణ్యం వెలికితీస్తేనే స్వయం శక్తులుగా ఎదుగుతారని, అందుకోసం పాటుపడుతున్న రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి దంపతులకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు దోపిడీకి పాల్పడారని, వారంతా ఐపీసీ 390 పరిధిలోకి వచ్చే వాళ్లన్నారు. మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ దోపిడీ దారులకు అడ్డుకట్ట వేసి, బడుగుల అభివృద్ధి కోసం విద్యావంతులను అసెంబ్లీకి తీసుకెళ్లిన కాంగ్రెస్ పేదల పక్షపాతి అన్నారు.

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పుట్టిన గడ్డకు సేవ చేయాలనే తన అత్తామామలు హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి-ఝాన్సీరెడ్డి స్ఫూర్తితో ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేస్తామని అన్నారు. యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసినప్పుడే అభివృద్ధి చెందుతారని, కుటుంబంలో ఒక్కరికి ఉపాధి లభిస్తే కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందన్నారు. వాళ్ల పడ్డ కష్టాలు ఎవ్వరూ పడవద్దనే ఉద్దేశ్యంతోనే యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో ప్లంబింగ్, బ్యూటీషియన్, చేనేత తదితర పనులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో తమ కోడలిని గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడం కోసం, పాలకుర్తిని అభివృద్ధి చేయడానికి శక్తినంతా ధారపోస్తానని అన్నారు. ఈ గెలుపు తమది కాదని, ప్రజల గెలుపేనని అన్నారు.

ఒకే వేదికపై ఐదుగురు ఎమ్మెల్యేలు

పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం గుర్తూర్ గ్రామంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనుల శంకుస్థాపనకు ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెలే డాక్టర్ మురళీనాయక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆతిథ్యం ఇచ్చారు.

నేడు పట్టుకున్న వాహనాల వేలం

హనుమకొండ క్రైం, జనవరి 8: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తనిఖీలలో పట్టుకున్న రెండు వాహనాలను మంగళవారం ఉదయం సర్క్యూట్ గెస్ట్‌హౌస్ సమీపంలోని హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్టు ఆబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక బొలెరో వాహనం, ఒక ద్విచక్రవాహనం వేలం వేయనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటలకు వేలం పాట ప్రారంభం అవుతుందని 50 శాతం దరావత్ సొమ్మును చెల్లించిన తర్వాత పాటలో పాల్గొనాలని రామకృష్ణ తెలిపారు.

మేడారంలో ముమ్మరంగా పనులు



జంపన్నవాగులో ఇసుక పోస్తున్న దృశ్యం



స్నాన ఘట్టాలను శుభ్రం చేస్తున్న కూలీలు

మేడారం, జనవరి, 8 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మల మహా జాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ఆయా పనులు చేపడుతున్నారు. జాతర తొలిరోజు కన్నెపల్లి నుంచి మేడారం గద్దెలకు సారలమ్మ జంపన్న వాగు మీదుగా చేరుకోనున్న నేపథ్యంలో పలు పనులకు శ్రీకారం చుట్టారు. వాగులోని లోతట్టు ప్రదేశంలో టిప్పర్ల సహాయంతో ఇసుకను పోస్తూ మరమ్మతులు చేస్తున్నారు. అలాగే జాతరలో భక్తుల కోసం స్నాన ఘట్టాలను నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ప్రారంభించారు. స్నానాల కోసం బ్యాటరీ ట్యాప్స్, మహిళలు బట్టలు మార్చుకునే గదులు సిద్ధం చేస్తున్నారు. ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో పూడికతీత పనులను ముమ్మరం చేశారు. సంక్రాంతి పండుగ లోపు అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

పరిశీలించిన ఐటీడీఏ పీవో

మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం నీటిపారుదల చేపడుతున్న పనులను ఐటీడీఏ పీవో అంకిత్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. పంచాయతీ రాజ్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని డీఈ సదయ్యకు సూచించారు. అనంతరం ఇన్‌ఫిల్టరేషన్ బావుల పూడికతీత, స్నాన ఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాబ్స్, ఆదివాసీ మ్యూజియం సుందరీకరణ పనులు పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో వసంతరావు, ఎస్‌వోఎం రాజ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరావు



కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య స్థానంలో శ్రీనివాసరావును నియమించారు. జనవరి 9న మంగళవారం వెంకయ్య నుంచి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. సోమవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. గతంలో కేయూలో శ్రీనివాసరావు దివ్యాంగుల సెల్ డైరెక్టర్‌గా, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్‌గా, క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రభుత్వ పాలన శాస్త్రం, హెచ్ఆర్ఎం విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా, విభాగాధిపతిగా కొనసాగుతున్నారు.

నేరస్థులకు శిక్షపడే కేసులు నమోదు చేయాలి

మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదావత్ రాజు

ఐనవోలు, జనవరి 8: నేరస్థులు తప్పుచేసి తప్పించుకోకుండా శిక్షపడే కేసులనే నమోదు చేయాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాదవత్ రాజు డిమాండ్ చేశారు. ఒంటిమామిడిపల్లిలో డిసెంబరు 25న మంత్రాల నెపంతో గోనె సోమలక్ష్మి(65) అనే వృద్ధురాలిని హత్యచేశారు. ఈ సంఘటనపై మానవహక్కుల వేదిక బృందం నిజనిర్ధారణ కోసం ఒంటిమామిడిపల్లి గ్రామంలో బాధితురాలి ఇంటిని సందర్శించి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. సోమలక్ష్మి దగ్గరి బంధువైన గోనె పెద్దరాజు కుమారుడు గోనె మధు డిసెంబరు 17న వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు మృతుడి తల్లిదండ్రులు దేవుడు చెప్పేవారి వద్దకు వెళ్లి అడిగించుకున్నారని తెలిపారు. దేవుడు చెప్పేవారు మీ సమీప బంధువు (చేతబడి) మంత్రాలు చేయడం వల్లే మీ కుమారుడు చనిపోయాడని చెప్పడంతో రాజు కుటుంబసభ్యులు సోమలక్ష్మిని హత్యచేశారని తెలిపారు. పోలీసులు సకాలంలో నిందితులను గుర్తించినప్పటికీ మూఢ నమ్మకాలను నమ్మి హత్య చేశారని వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని తెలిపారు. కేవలం హత్యచేశారని కేసు నమోదు చేయడంతో సరైన సాక్షాధారాలు ప్రత్యక్ష సాక్షులు లేరని కేసు నీరుగారి నిందితులు బయటకు వస్తారన్నారు. పోలీసులు కేవలం హత్యకేసు కాకుండా సంఘటనా స్థలంలో లభించే వాస్తవ ఆధారాలతో హత్య చేశారని కేసు నమోదు చేస్తే నిందితులకు శిక్ష పడుతుందన్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకరావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి టి. హరికృష్ణ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి దిలీప్ పాల్గొన్నారు.

ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్

హనుమకొండ అర్బన్, జనవరి 8 : ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్ టీయూసీ) ఎంజీఎం బ్రాంచ్ ప్రెసిడెంట్ గద్దెల ప్రేమలత అధ్యక్షతన సోమవారం నూతన సంవత్సర సంబరాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ కేక్ కట్ చేసి మాట్లాడారు. ఎంజీఎం ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, కొప్పు ప్రసాద్, ప్రేమలత, ఎంజీ ఎం బ్రాంచ్ ఫార్మసీ సూపర్‌వైజర్ ఎంకి పద్మావతి, సునీత, రాజ్యలక్ష్మీ, ప్రీతి, సజని, సుప్రియ, సరళారాణి, సల్మా, శ్యామల, సృజన, ఉదయకృష్ణ, రమాదేవి, భిక్షపతి, ఉమాదేవి, జమున, సుచరిత, అనురాధ తదిత రులు పాల్గొన్నారు.

కేయూ ఏబీవీపీ నూతన కమిటీ ఎంపిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రశాంత్, శ్రావణ్



ప్రశాంత్



శ్రావణ్

కేయూ క్యాంపస్, జనవరి 8 : కాకతీయ యూనివర్సిటీ అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన అధ్యక్షుడిగా కొక్కుల ప్రశాంత్, కార్యదర్శిగా బొండ్ల శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం కేయూ న్యూబాయ్స్ హాస్టల్‌లో ఏబీవీపీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి, ఏబీవీపీ వరంగల్ విభాగ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబులు హాజరై కేయూ కమిటీ వివరాలను ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు వైస్ ప్రెసిడెంట్స్ లక్ష్మణ్, అశోక్, నవీన్, చరణ్, రాజు, లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీస్‌గా రాజు, అజయ్, రఘు, సాయి, ప్రకాశ్, యశ్వంత్, శివ తదితరులు ఎంపికైయారు. ఈ సమావేశంలో నూతన కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజష్, రాష్ట్ర నాయకులు అంబాల కిరణ్, చట్ల సతీశ్, పెండ్ల అమర్, గట్టు ప్రశాంత్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు

హనుమకొండ రూరల్, జనవరి 8 : 2023-24 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియేట్‌లలో ఈ నెల 11వ తేదీలోపు చివరి అవకాశంగా అపరాధ రుసుంతో అడ్మిషన్ పొందవచ్చునని డీఈవో అబ్దుల్ హై, ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజు www.telanganaopenschool.org ఆన్‌లైన్‌లో చెల్లించి రశీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 80084 03631, 93963 37572 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా రవి



తాళ్ళపెల్లి ప్రకాశ్



దుర్గం రవి

ఖిలావరంగల్, జనవరి 8: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్ళపెల్లి ప్రకాశ్, ఉపాధ్యక్షుడుగా దుర్గం రవిలు ఎన్నికయ్యారని టీజీఏ రాష్ట్ర సంఘం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు చెన్నూరి వెంకట విమాదిత్య ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికలలో ప్రకాశ్, రవిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పేర్కొన్నారు. వరంగల్ నగరానికి చెందిన వీరు రెండేళ్లపాటు కమిటీలో కొనసాగుతారన్నారు.

కేయూ హాస్టల్స్‌లో అవినీతిపై విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ, బీఎస్ఎఫ్ నేతల డిమాండ్

కేయూ క్యాంపస్, జనవరి 8: కేయూ హాస్టళ్లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి కల్లెపల్లి ప్రశాంత్ డిమాండ్ చేశారు. కేయూలో జరిగిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. నాణ్యతలేని పాలు, పెరుగు, కిరాణ సామాన్లను పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై నాణ్యతలేని సరుకులను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. వర్సిటీ అధికారులు తమకు అనుకూ లమైన వారికి కాంట్రాక్టర్లు ఇప్పించుకుంటున్నారని మండిపడ్డారు. నాసిరకం ఆహార పదా ర్థాలు సరఫరాతో విద్యార్థులు తరుచుగా అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు హతిరాం, జిల్లా కమిటీ సభ్యుడు స్టాలిన్, జస్వంత్, రోహిత్, బీఎస్ఎఫ్ నాయకులు మధు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో అంకిత్


ఐటీడీఏ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న పీవో అంకిత్

ఏటూరునాగారం రూరల్, జనవరి 8: గిరిజనుల సమస్యలను ఐటీడీఏ సెక్టోరియల్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని పీవో అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించి గిరిజన దర్బార్‌లో ఆయన వినతులను స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 17 మంది గిరిజనులు తమ గోడును పీవోకు విన్నవించుకున్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో వర్కర్‌గా ఉద్యోగావకాశం కల్పించాలని వాజేడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పూనం సరస్వతి వినతి పత్రం అందించారు. గిరిజన గురుకులాల్లో ల్యాబ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలను ఎలాంటి నోటిఫికేషన్లు లేకుండా నియమించారని, వాటిని వెంటనే తొలగించాలని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ సభ్యుడు ఛైపతి సంతోష్ కుమార్ కోరారు. తమ గ్రామంలో గ్రావెల్స్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మంగళవారిపేట గ్రామానికి చెందిన వేముల ప్రకాశ్ వినతి పత్రం అందించారు. ఐటీడీఏ ద్వారా ట్రైకార్ లోన్ మంజూరు చేయాలని గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన వీరీల ధర్మయ్య కోరారు. సీఆర్‌టీ పీడీ ఉద్యోగాన్ని రెన్యూవల్ చేయాలని కన్నాయిగూడెం మండలం ఐలాపురానికి చెందిన ఆలం నాగేష్ వినతి పత్రం సమర్పించారు. మిషన్‌భగీరథలో వాటర్‌మన్‌గా ఉద్యోగావకాశం కల్పించాలని తాడ్వాయి మండలం కోడిశాల గ్రామానికి చెందిన విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా లోన్లు మంజూరు చేయాలని మంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన పెద్ద సతీష్ వినతి పత్రం అందించారు. ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన ఉద్యోగ అవకాశం కల్పించాలని వాజేడు మండలం కృష్ణాపురానికి చెందిన మౌనిక పీవోకు వినతిపత్రం అందించారు. త్వరలో జరగనున్న మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు ఎండ్లబండ్ల రహదారుల మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని తుడుందెబ్బ నాయకులు పోడెం బాబు కోరారు. నర్సంపేటలో ఆదివాసీ సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం కమిటీ హాల్‌కు స్థలం కేటాయించాలని ఆ సంఘం నాయకుడు వాసం కుమారస్వామి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

మేడారం భక్తుల కోసం రోడ్డు పనులు చేపట్టాలి

వచ్చే నెలలో జరగనున్న మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద నుంచి కొండాయి మీదుగా మేడారం వెళ్లే రహదారిని ఆయన పరిశీలించారు. దొడ్ల-మల్యాల గ్రామాల మధ్య జంపన్నవాగు వద్ద చేపడుతున్న రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా కొండాయి- ఊరట్టం గ్రామాల మధ్య కొండ్రెటివాగు వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా కల్వర్టు పనులను చేపట్టాలన్నారు. రహదారి వెంట చెట్ల పొదలను త్వరిగతిన తొలగించాలని, దెబ్బతిన్న ప్రదేశాల్లో రోడ్లకు చేపడుతున్న మరమ్మతు పనులను నాణ్యతతో చేపట్టాలని న్నారు. ఆయన వెంట ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

శరవేగంగా దరఖాస్తుల డాటా ఎంట్రీ


డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న అధికారులు

కాటారం, జనవరి 8: మండల వ్యాప్తంగా 24 ప్రజాపాలన సదస్సుల్లో స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ డాటా ఎంట్రీ శరవేగంగా సాగుతోంది. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, మీ- సేవా కేంద్రాలు, సీఎస్‌సీల్లో దరఖాస్తులను 40 మందికి పైగా ఆపరేటర్లు ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. డాటా ఎంట్రీ ప్రక్రియను మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో ఉపేంద్రయ్య పర్యవేక్షించారు. మండలంలోని 24 జీపీల పరిధిలో 6,500కు పైగా దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీపీవో, అధికారులు

కాటారం, జనవరి 8: ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత హెచ్చరించారు. మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. నిర్మాణదారులతో మాట్లాడారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలోనే ఇళ్లను నిర్మించుకుంటున్నామని కొందరు ఉద్దేశ పూర్వకంగానే తమపై ఫిర్యాదు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డీపీవో వెంట తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో ఉపేంద్రయ్య, సర్పంచ్ రాహుల్, కార్యదర్శి కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

చెకుముకి పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లిటౌన్, జనవరి 8: చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) రామ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో భాగంగా ప్రతి ఏడాది విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 19న పాఠశాల స్థాయిలో 27న మండల స్థాయిలో, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనాలని చెప్పారు. జిల్లా స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ సూపరింటెండెంట్ శ్రీధర్, సెక్టోరియల్ అధికారులు లక్ష్మణ్, కరుణాకర్, రాజగోపాల్, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, చెకుముకి కన్వీనర్ బోట సాంబయ్య, జెవీవీ జిల్లా సభ్యుడు కుసుమ కృష్ణమోహన్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో, విద్యాశాఖ అధికారులు

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

మంగపేట, జనవరి 8: అయోధ్య నుంచి మండలంలోని బోరునర్సాపురానికి చేరిన శ్రీరామ విగ్రహ ప్రాణప తిష్ట అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, బీఎంఎస్, బీజేపీ నాయకులు అక్షింతలు, కరపత్రా లకు సీతారామాంజనేయస్వామి దేవాల యంలో ప్రత్యేక పూజలు చేసి నగర సంకీర్తణ నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ రామ భక్తులు పంపిణీ చేశారు. ఈనెల 15 వరకు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలు అందించే ఏర్పాట్లు చేశామని పాకనాటి వెంకట్‌రెడ్డి, కొడం శ్రీనివాస్, గుజ్జుల కోటిరెడ్డి, నర్రా శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రామ భక్తులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న తాడ్వాయి ఎస్సై



మేడారం, జనవరి 8: తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీకాంత్‌రెడ్డి మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను సోమ వారం దర్శించు కున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వ హించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా రులు, దేవాదాయ శాఖ అధికారులు కండువాతో అయన్ను సన్మానించి తల్లుల ప్రసాదాన్ని అందజేశారు.

చదరంగంలో విద్యార్థిని ప్రతిభ

మేడారం, జనవరి 8 : తాడ్వాయి మండలం ఊరట్టం గిరిజన బాలికల ఇంగ్లిష్ ఆశ్రమ పాఠశాల తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కొమరం ప్రశాంతి రాష్ట్ర స్థాయి చదరంగంలో ప్రతిభ చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. జనవరి 4 నుంచి 6 వరకు భద్రాచలంలో జరిగిన గిరిజన సంక్షేమ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ఆమె పాల్గొంది. ప్రతిభ కనబర్చిన ప్రశాంతిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ


ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్

ములుగు కలెక్టరేట్, జనవరి 8: వివిధ సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో సమర్పించే దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.శ్రీజ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరగగా ఆమె అదనపు కలెక్టర్(రెవెన్యూ) వేణుగోపాల్‌తో కలిసి పాల్గొని ప్రజలనుంచి 23దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా శ్రీజ మాటా్ల్డుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించ రాదని, వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ చదువుకునే విద్యా ర్థులకు ఎంసెట్ పరీక్ష కోసం శిక్షణ తరగతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కన్నాయిగూడెం, వెంకటాపురం మండలాల్లో జూనియర్ కళాశాలల కోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నిరుద్యోగ యువత కోసం వివిధ కంపె నీలతో సంప్రదించి మెగా జాబ్‌మేళాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. అదేవిధంగా పదోతరగతి విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించేవిధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, సీపీవో ప్రకాష్, పశువైద్యాధికారి విజయభాస్కర్, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మణ్, ఇంటర్మీడియట్ విద్య అధికారి వెంకటేశ్వర్లు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

గోవిందరావుపేట, జనవరి 8: మండలంలోని చల్వాయి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మోడల్‌స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీజ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె ఉపాధ్యాయుల హాజరు పట్టిక, వంటగది, స్టోర్‌రూంను పరిశీలించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఉపాధ్యాయులు, విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని వాష్‌రూంలు, ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని పాఠశాల ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి అదనపు కలెక్టర్‌ను కోరారు. పదోతరగతి విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమెవెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

హేమాచలుడి వరపూజ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ


హేమాచల క్షేత్రంలో వరపూజోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అర్చకులు ఉద్యోగులు

మంగపేట, జనవరి 8: మకర సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 15న మండలంలోని మల్లూరు శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే మహా వరపూజ కార్యక్రమం పోస్టర్‌ను, కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. హేమాచల క్షేత్రంలోని కల్యాణ మంటపం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. వరపూజ మహా ఉత్సవానికి సుమారు 20 వేల మంది భక్తులు తరలివస్తారని దేవస్థానం ఈవో సత్యనారాయణ, మల్లూరు గుట్ట ఛైర్మన్ నూతలకంటి ముకుందం తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో ప్రధానార్చకులు క్రైంక్రైర్యం రాఘవాచార్యులు, ముక్క మల్ల రాజశేఖరశర్మ, అర్చకులు పవన్‌కుమారా చార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

12న హుండీల లెక్కింపు

మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 12న ఉదయం 10 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహి్‌స్తున్నట్లు దేవస్థానం ఈవో ఎస్. సత్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ నూతలకంటి ముకుందం, ప్రధానార్చకులు రాఘవాచార్యులు, రాజశేఖరశర్మ తెలిపారు. గర్భాలయంలో రెండు, రమ సత్యనారాయణస్వామి ఆలయంలో ఒకటి, వేణుగోపాలస్వామి దేవాలయంలో ఒకటి, పంచముఖాం జనేయా స్వామి ఆలయం వద్ద ఒకటి జలాంజనేయ స్వామి గుడి వద్ద ఒకటి, ద్వైతమాత వద్ద ఒకటి ఏర్పాటు చేసిన హుండీలను వరంగల్ ఉమ్మడి జిల్లాల ఎండోమెంట్ అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి సమక్షంలో లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్‌డీఎంఏ


ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తు ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్‌డీఎంఏ

భూపాలపల్లిటౌన్, జనవరి 8: భూపాలపల్లి మునిసిపల్ కార్యాలయాన్ని మునిసిపల్ పరిపాలన ప్రాంతీయ సంచాలకుడు (ఆర్‌డీఎంఏ) షాహిద్ మసూద్ సోమవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుచనున్న ఆరు గ్యారెంటీల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నవీకరించడాన్ని పరిశీలించారు. అలాగే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మునిసిపల్ కమిషనర్ అనిల్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట టీపీవో సునీల్ కుమార్, టెక్నికల్ ఆఫీసర్ మానస, ఆర్‌ఐ భాస్కర్ తదితరులు ఉన్నారు. .

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా బుచ్చిరాములు



టేకుమట్ల, జనవరి 8: పీఆర్‌టీయూ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా బుచ్చిరాములును ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బుచ్చిరాములు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆశ్రమ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఐటీడీఏ ప్యానల్ టీం

గోవిందరావుపేట, జనవరి 8: మండలంలోని కర్లపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం ఐటీడీఏ ప్యానల్‌టీం సందర్శించింది. ఈసందర్భంగా నాలుగో తరగతి ఉద్యోగుల పనితీరు, మెనూ ప్రకారం భోజనం, పరిసరాల పరిశుభ్రత, ఉపాధ్యాయుల బోధన తీరు, ఉపాధ్యాయుల డైరీ, లెసన్‌ప్లాన్, ఇయర్‌ప్లాన్, పీరియడ్ ప్లాన్ పరీక్ష, నోట్‌బుక్స్, ల్యాబ్ నోట్స్, లైబ్రరీ నోట్‌బుక్స్, విద్యార్థుల నైపుణ్యంతోపాటు మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్, వంటగది, క్లాస్‌రూంలు, స్టోర్‌రూం, సైన్స్‌ల్యాబ్, మెడికల్ గది, కంప్యూటర్ ల్యాబ్, మినరల్ వాటర్‌ప్లాంట్, ఆట స్థలాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల పనితీరు, బోధించిన విషయాలపై సద్విమర్శ సమావేశం ఏర్పాటుచేసి ప్రతి విషయాన్ని చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ టీం సభ్యులు సావిత్రి, ప్రధానోపాధ్యాయుడు కల్తి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

గోవిందరావుపేట, జనవరి 8: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎస్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీని సోమవారం ఎంఈవో గొంది దివాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం కృష్ణయ్య, మండల అధ్యక్షుడు కందిక రాజు, ప్రధాన కార్యదర్శి జన్ను శ్యాంసన్, నాయకులు నరేష్, రేణుక, లక్ష్మి, ఎమ్మార్సీ సిబ్బంది విష్ణు, చందు తదితరులు పాల్గొన్నారు.

ఎదిర వైద్యశాలలో క్లీన్అండ్‌గ్రీన్

వెంకటాపురం(నూగూరు), జనవరి 8: మండలంలోని ఎదిర వైద్యశాల ఆవరణలో వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు సోమవారం క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం భవ్యశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, కరోనా లక్షణాలపై వివరించి అప్రమత్తం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల కంప్యూటరీకరణను పరిశీలించిన స్పెషలాఫీసర్

తాడ్వాయి, జనవరి 8: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తుల కంప్యూటరీకరణను సోమవారం మండల స్పెషలాఫీసర్, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన అధికారులతో కలిసి ఎంపీడీవో, తహసీల్దార్, ఐకేపీ సెంటర్, ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలను తనిఖీ చేశారు. మండలంలో మొత్తం 7,369 దరఖాస్తులు రాగా మధ్యాహ్నం ఒంటిగంట వరకు 2202 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసమయంలో ఆస్పత్రికి ఆశ్రమ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి తగిన వైద్యం అందించాలని వైద్యాధికారి అన్నదీర్నిని ఆదేశించారు. ఆయనవెంట ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో శ్రీధర్, తదితరులు ఉన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశానికి 20 వరకు గడువు

ములుగు కలెక్టరేట్, జనవరి 8: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల విద్యాలయాల్లో ఐదోతరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువును ఈనెల 20 వరకు పొడిగించినట్లు అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఆమె అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా శ్రీజ మాట్లాడుతూ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ పాఠశాలల్లో ఐదో తరగతిలో గురుకుల ప్రవేశాల కోసం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 8: అప్రెంటిస్‌షిప్ కోసం ఇంటర్ ఒకేషనల్ పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి పి.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2021, 22, 23 సంవత్సరాల్లో ఎమ్మెల్టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 20లోగా ములుగులోని ఇంటర్ విద్యా శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మండల సమావేశంలో తాగునీటి సమస్యపై చర్చ

వెంకటాపూర్(రామప్ప), జనవరి 8: గత కొన్నినెలలుగా మండల కేంద్రంలో తాగునీటి సమస్య ఏర్పడినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ బుర్ర రజిత, జడ్పీటీసీ గై రుద్రమదేవి పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో తాగు నీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకె ళ్లినా పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే తగు చర్యలకు బాధ్యులవుతారని అన్నారు. అదే విధంగా మండల సభకు హాజరుకాని అధికారులపై తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల స్పెషలాఫీసర్ శ్రీపతి, తహసీల్దార్ శివకుమార్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

గణపురం, జనవరి 8: మున్నూరుకాపు సంక్షేమ సంఘం చెల్పూరు కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా రాందాసు ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శులుగా సాంబమూర్తి, కల్యాణ్, జాయింట్ సెక్రటరీ సతీష్, కోశాధికార్శులుగా శివ, సుధాకర్‌ను ఎంపిక చేసినట్లు ఆ సంఘం నూతన అధ్యక్షుడు ప్రభాకర్ ప్రకటించారు. భూపాలపల్లి మండల గౌరవ అధ్యక్షుడు లక్కం యాదగిరి సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది.

దుప్పట్ల పంపిణీ

తాడ్వాయి, జనవరి 8: మండలంలోని కాటాపూర్‌లో వితంతువులు, వృద్ధులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్ పుల్లూరి గౌరమ్మ చేతుల మీదుగా చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సంస్థ సభ్యులు కంతి ముత్తయ్య, ముర్రం రాజేష్, లక్ష్మణ రావు, పొడెం నారాయణ, రాంబాబు, వట్టం బాలరాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.